### ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా మధుమూర్తి నియామకం

ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా మధుమూర్తిని ఆ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.ఏపీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాతే రోజు ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఉన్న హేమచంద్రారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఈ చైర్మన్ పదవి ఖాళీగానే ఉంది. వైస్ చైర్మన్ రామ్మోహన్ రావునే ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో మధుమూర్తిని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది .కొత్తగా ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమితులైన మధుమూర్తి స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి మండలం జాగర్లమూడి గ్రామం. విశాఖలో ఆయన విద్యాభ్యాసం పూర్తి చేశారు.

# విభారె


తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 22-12-2024 సంపుటి : 06 సంచిక : 79 పేజీలు : 8 వెల : రూ 3-00


## రెండు రోజులపాటు ప్రధాని మోదీ కువైట్ పర్యటన



న్యూఢిల్లీ, డిసెంబర్ 21 : ప్రధాని మోదీ రెండు రోజుల కువైట్ పర్యటనకు వెళ్లారు. భారత్, గల్ఫ్ దేశాల మధ్య శాంతి, భద్రత, స్థిరత్వం ముఖ్యమన్నారు. సిరియాలో అసద్ బాషర్ ప్రభుత్వం నిర్వీర్యం కావడం, గాజాలో ఇజ్రాయిల్ దాడులు పెంచిన నేపథ్యంలో.. ప్రధాని మోదీ గల్ఫ్ పర్యటన చేపట్టడం ఆసక్తిని పెంచింది. కువైట్ టాప్ నేతలతో చర్చలు జరపనున్నామని, రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని పెంచుకోనున్నట్లు వెల్లడించారు. సుమారు 43 ఏళ్ల తర్వాత భారత ప్రధాని కువైట్ పర్యటనకు వెళు న్నారు. రెండు దేశాల మధ్య ఉన్న చరిత్రాత్మక సంబంధాలను గౌరవిస్తున్నట్లు చెప్పారు. వాణిజ్యం అంశంలో రెండు దేశాల మధ్య బంధం బలంగా ఉందన్నారు.

## తెలంగాణ సినీ పరిశ్రమపై రేవంత్ మండిపాటు ..

### షూటింగ్‌లకు ఏపీకి రమ్మని పవన్ కల్యాణ్ రిక్వెస్ట్

అమరావతి : తెలంగాణలో సినిమా పరిశ్రమపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో కలకలం రేపుతుండగా మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ షూటింగ్‌లకు ఏపీకి రావాలని పిలుపునివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.పుష్ప -2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్‌లో బెనిఫిట్ షో ప్రదర్శనను చూసేందుకు హీరో అల్లుఅర్జున్ అక్కడికి వచ్చిన రాగా జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందగా ఆమె కుమారుడు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ ఘటనలో హీరో అల్లు అర్జున్ బాధ్యతా రహితంగా వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో శనివారం పలు వ్యాఖ్యలు చేశారు.11 రోజుల వరకు బాధిత కుటుంబం వద్దకు హీరో, నిర్మాత వెళ్లలేదని.. బాధిత కుటుంబాన్ని హీరో, నిర్మాత పరామర్శించలేదని ఆరోపించారు. ఒక్క రోజు హీరో జైలుకు వెళ్లి వస్తేనే..



సినిమావారంతా ఇంటికి పరామర్శలకు క్యూ కట్టారని.. టాలీవుడ్ ప్రముఖులపై మండిపడ్డారు. ప్రజల రక్షణ తమ బాధ్యత అంటూనే బాధ్యతరహితంగా ప్రవర్తించే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదంటూ సినీ ఇండస్ట్రీని ఘాటుగానే హెచ్చరించారు.కాగా ఏపీలోని అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తున్న పవన్‌కల్యాణ్ సినీ రంగంపై మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో చాలా సుందరమైన ప్రదేశాలున్నాయని, సినిమా పరిశ్రమ ఇక్కడికి వచ్చి సినిమా షూటింగ్‌లు చేయాలని సూచించారు. విదేశాల్లో ఉండే అందమైన ప్రదేశాలు గిరిజన, పల్లె ప్రాంతాల్లోనూ ఉంటాయని తెలిపారు. ఇటువంటి స్థలాల్లో షూటింగ్‌లు చేస్తే గిరిజనులకు ఉపాధి లభిస్తుందని అన్నారు.

## పుష్పా-2 ఘటన ఎంతో కలిచివేసింది...

కనీసం మానవత్వం చూపని సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు

సమాజం ఎటువైపు పోతుంది..

హీరోలంటే.. తెరపైన కాదు.. నిజజీవితంలో చూపాలి

హీరోలను అరెస్టు చేయకుండా ఏమైనా చట్టాలు ఉన్నాయా..?

ఉంటే చెప్పండి.. అలా నడుచుకుంటాం :

తల్లి చనిపోయి.. కుమారుడు ఆస్పత్రిలో ఉంటే కనీసం ఒక్కరూ చూడలేదు

అసెంబ్లీలో భావోద్వేగానికి గురైన సీఎం రేవంత్‌రెడ్డి



నల్లగొండ, డిసెంబర్ 21 : కొన్నికొన్ని సంఘటనలు చూస్తే మనసు చలించిపోతుందని, అసలు సమాజం ఎటువైపు పోతుందని బాధేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం జరిగిన అసెంబ్లీలో సమావేశంలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అసెంబ్లీ సమావేశంలో భాగంగా పుష్పా-2 సినిమా బెన్‌ఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన ప్రస్తావన సందర్భంగా సీఎం మాట్లాడారు. పుష్పా-2కు సంబంధించి టిక్కెట ధరలు విషయంలో, బెన్‌ఫిట్ షోకు సంబంధించి ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని సీఎం గుర్తు చేశారు. కానీ బెన్‌ఫిట్ షోకు వస్తే జనం కిక్కిరిసి ఉంటారని, కనీసం జ్ఞానం లేకుండా లేకుండా, పోలీసులకు సరైన సమాచారం ఇవ్వకుండా థియేటర్‌కు రావడంతో ఒక మహిళ చనిపోవడంతోపాటు ఆమె కుమారుడు అపస్మార స్థితిలో ఉన్నాడని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా కనీసం చలనం కూడా లేకుండా అక్కడ ఉండి సినిమా చూస్తా అనడం దేనికి సంకేతమని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇంకా అక్కడే ఉంటే మరింత ప్రమాదం జరుగుతుందని సినీహీరో అల్లుఅర్జున్‌కు చెప్పిన పోలీసులు ఇప్పటికే ఒకరు చనిపోయారు, ఒకరి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని చెప్పినా కూడా వెళ్లకుండా ఉండటంతో మీరు ఇక్కడే ఉంటే అరెస్టు చేయాల్సి వస్తుందని అనడంతో అప్పుడు వెళ్లిపోయారన్నారు. అది కూడా వెళ్లే సమయంలో ఓపెన్‌టాప్ జీపులో చేతులు బయటకు ఊపుతూ కనీసం ఎవరూ చనిపోయారు, ఎవరూ గాయాలు పాలయ్యారు అని చూడకుండా ఉండటం ఎంత వరకు సబబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు

## బస్సు ఎక్కితే నో టికెట్... ఎప్పటినుంచంటే...



అమరావతి: మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి మంత్రి వర్గ ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘం నియమకం అయింది . హోం మంత్రి అనిత, గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సభ్యులుగా ఉప సంఘం ఏర్పాటైంది. రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కన్వినర్‌గా ఈ ఉప సంఘం ఉండనుంది.ఉచిత బస్సు ప్రయాణం అమలవుతున్న పలు రాష్ట్రాల్లో అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వానికి మంత్రి వర్గ ఉప సంఘం నివేదిక ఇవ్వనుంది. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఈరోజు మంత్రి వర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం నియమించింది. తాజాగా ఈ పథకం అమలుపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వచ్చే సంక్రాంతి నుంచే ఫ్రీ జర్నీ అమలు చేస్తామని, దీనికోసం ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోందని చెప్పిన విషయం తెలిసిందే.

## సీఎం ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం

పల్నాడు జిల్లా, డిసెంబర్ 21: నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక శనివారం జరిగింది. ఛైర్మన్‌గా పులుకూరి కాంతారావు, వైస్ ఛైర్మన్‌గా ఉప్పలపాటి చక్రపాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిరువురికి కలెక్టర్ అరుణ్ బాబు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గుంటూరు, ప్రకాశం జిల్లా రైతులకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎంతో ప్రతిష్టాత్మకమైనదన్నారు. గత ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం సాగర్‌ని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు.రెండు జిల్లాల ప్రజలకు తాగు, సాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. వైసీపీ నేతలు వారి పాలన మొత్తం అరాచకాలపై దృష్టి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ఒంగోలు ఎమ్మెల్యేల సహకారంతో ఈ ఎన్నిక జరిగిందని తెలిపారు. రైతులను కంటికి రెప్పలా కూటమి ప్రభుత్వం కాపాడుతోందన్నారు. రైతుల విషయంలో చంద్రబాబు ఆశయాలు ముందుకు తీసుకెళతామని యరపతినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు.



## కాలయాపన తప్ప‘ ఫ్రీ బస్’ అమలుపై చిత్తశుద్ధి లేదు :

### కూటమి ప్రభుత్వంపై వైఎస్ షర్మిల కీలక వ్యాఖ్యలు



అమరావతి : మహిళలకు ఫ్రీ బస్ పథకం అమలుపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. టీడీపీ , జనసేన పార్టీలకు కాలయాపన తప్పా ఇచ్చిన హామీ నిలబెట్టుకునే బాధ్యత కనిపించడం లేదని ట్విట్టర్ వేదిక ద్వారా విమర్శించారు.అధికారం చేపట్టిన 6 నెలల్లో పండుగలు, పబ్బాలు పేరు చెప్పి దాటవేశారు. బస్సులు కొంటున్నాం అని చెప్పుకొచ్చారు. ఇప్పుడు మంత్రివర్గ ఉప సంఘం పేరుతో మరికొన్ని రోజులు సాగతీతకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఉచిత ప్రయాణం కల్పించడంలో ఇన్ని బాలారిష్టాలు ఎందుకని ఆమె చంద్రబాబును ప్రశ్నించారు. చిన్న పథకం అమలుకు కొండంత కసరత్తు దేనికోసమని నిలదీశారు.తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే పథకం అమలు చేసి చూపించారని గుర్తు చేశారు. ఉన్న బస్సుల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించారు కదా ? పథకం అమలును బట్టి అదనపు ఏర్పాట్లు చేసుకున్నారని తెలిపారు. జీరో టిక్కెట్ల కింద నెలకు రూ.300 కోట్లు ఆర్టీసీకి ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర నిధులు లేవా ? మహిళల భద్రతకు మీకు మనసు రావడం లేదా ? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ యాజమాన్యం చెప్తుంటే మీకొచ్చిన ఇబ్బంది ఏమిటని పేర్కొన్నారు. కనీసం నూతన సంవత్సర కానుక కిందైనా మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఉత్తరాంధ్రలో వర్షాలపై వాతావరణ శాఖ కీలక ప్రకటన



విశాఖపట్నం, డిసెంబర్ 21: గత మూడు రోజులుగా ఉత్తరాంధ్రలో వర్షాలు దంచికొడుతున్నాయి. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షాలకు పంటలు నీటమునిగాయి. చేతికి వచ్చిన పంట ఇలా నీటిపాలు అవడంతో రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడం ప్రభావంతో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో మూడు రోజులు ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. బలమైన గాలులు వీచాయి. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలహీనపడుతోందని వాతావరణ శాఖ అధికారులు గుడ్ న్యూస్ చెప్పారు.పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందని.. వాయుగుండం ఈశాన్య దిశగా కదులుతోందని తెలిపారు. రాగల 24 గంటల్లో వాయుగుండం బలహీన పడుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో వర్షాలు తగ్గుముఖం పడతాయన్నారు. ఉత్తరకోస్తా జిల్లాల్లో చెదురు మధురుగా వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. అలాగే తీరం వెంబడి 35 నుంచి 45 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. సముద్రంలో అల్లకల్లోలం కారణంగా మత్స్యకారులు వేటకు వెళ్ళారాదని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అలాగే పోర్టులకు మూడవ నెంబర్ ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందన్నారు. కాగా.. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా విజయనగరం జిల్లా బొండపల్లిలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. బీమిలి సహా పలు ప్రాంతాల్లో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది.

## కొన్ని ఎన్నికల పత్రాలు ఇక ప్రజలకు అందవు

అమరావతి:ప్రజలకు ఇంత వరకు సులభంగా అందుబాటులో ఉంటున్న కొన్ని రకాల ఎన్నికల పత్రాల లభ్యతపై ఆంక్షలు విధిస్తూ కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ ఎన్నికల ప్రవర్తన నిబంధనావళి (సిఇఆర్)ని సవరించింది. ‘ఎన్నికలకు సంబంధించిన అన్ని ఇతర పత్రాలు ప్రజల పరిశీలనకు అర్హం’ అని 1961 ఎన్నికల ప్రవర్తన నిబంధనావళిలోని 93(2)(ఎ)నిబంధన ఇంతకు ముందు తెలియజేసింది. శుక్రవారం జరిగిన సవరణ దృష్టా ఆ నిబంధన ఇక ‘ఎన్నికలకు సంబంధించిన ఈ నిబంధనల్లో నిర్దేశించిన ప్రకారం అన్ని ఇతర పత్రాలు ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంటాయి’ అని సూచిస్తోంది. పార్లమెంట్, అసెంబ్లీలకు ఎన్నికల సమయంలో సృష్టించిన, నిబంధనావళిలో నిర్దేశించని అధికార పత్రాల శ్రేణికి అందుబాటును ‘ఈ నిబంధనలలో నిర్దేశించిన ప్రకారం’ అన్న పదాల చేర్పు పరిమితం చేస్తోందని హక్కుల కార్యకర్తలు వాదిస్తున్నారు.నిబంధనావళిలో ప్రస్తావించని, కానీ ప్రిసైడింగ్ అధికారులు, ప్రభావశీల నియోజకవర్గాల జాబితా రూపొందించే, ఇవిఎంల రవాణాకు, పోలింగ్ రోజు లోపభూయిష్టంగా మారిన వాటి మార్పునకు బాధ్యులైన సెక్టార్ అధికారులు, పోలీస్, వ్యయ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు, ప్రధాన ఎన్నికల అధికారులు వంటి ఎన్నికల అధికారులు సృష్టించిన పత్రాల శ్రేణి ఉందని ఆర్‌టిఐ కార్యకర్త వెంకటేశ్ నాయక్ తెలిపారు.

# సంపాదకీయం

ఆదివారం 22-12-2024

## మళ్లీ కవ్విస్తున్న చైనా

భారత్ చైనాల మధ్య పరిస్థితులు మెరుగవుతున్నాయని అనుకుంటున్న తరుణంలో చైనా తన వంకర బుద్ధిని మరోసారి బయట పెట్టుకుంటుంది. భారత్‌తో ఉన్న సరిహద్దుల వెంబడి చైనా ప్రాభల్యం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. భూటాన్‌లోని డోక్లామ్ సమీపంలో భారత్-చైనా ప్రతిష్టంభన ఏర్పడిన దాదాపు 8 సంవత్సరాల తర్వాత, వ్యూహాత్మక ప్రదేశానికి సమీపంలో చైనా గ్రామాలను నిర్మిస్తోంది. ఇప్పటికే, సుమారు 22 గ్రామాలను నిర్మించినట్లు ఉపగ్రహ డేటాలో గుర్తించారు. ఈ 22 గ్రామాల్లో 8 గ్రామాలు భూటాన్‌లోని డోక్లామ్ పీఠభూమికి దగ్గరగా ఉన్నాయి. ఈ గ్రామాలు భారత సరిహద్దుకు సమీపంలో? చైనా క్లెయిమ్ చేస్తున్న వ్యూహాత్మక లోయల్లో, కొండల్లో ఉన్నట్లు తెలుస్తోంది. "చికెన్ నెక్" అనే పేరుతో పిలిచే సిలిగురి కారిడార్‌కు ఇది దగ్గరగా ఉంది. ఈ ప్రాంతం? భారతదేశంలోని ఇతర ప్రాంతాల నుండి ఈశాన్య భారతదేశానికి వెళ్లే ఎంట్రీ ద్వారంగా పిలుస్తారు. అందుబాటులో ఉన్న ఉపగ్రహ చిత్రాల ప్రకారం, 2020 నుండి ఈ వ్యూహాత్మక ప్రాంతంలో చైనా గ్రామాలు కనిపిస్తున్నాయి. అలాగే, ఈ గ్రామాలకు సమీపంలో చైనా సైనిక స్థావరాలు, అవుట్‌పోస్టులు కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. భూటాన్ భూభాగంలో చైనా నిర్మించిన అతిపెద్ద గ్రామాల్లో జివు అనే గ్రామం ఒకటి. నివేదికల ప్రకారం, ఈ గ్రామం సాంప్రదాయ భూటాన్ పశ్చిమ సెక్టార్‌లోని పచ్చిక బయళ్లలో త్షేతాంగ్ఖా అని పిలిచే ప్రాంతంలో అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఈ విషయంపై ఇప్పటివరకు ఎటువంటి కచ్చితమైన సమాచారం అందుబాటులోకి రాలేదు. అయితే, 2017లో భారత్-చైనా సరిహద్దు సమస్యలో భాగంగా ఈ భూభాగంలో ప్రతిష్టంభన ఏర్పడింది. భారత్-చైనా-భూటాన్ దేశాల మధ్య ఉన్న డోంగ్లాంగ్ ట్రైజంక్షన్ ఇది. డోక్లామ్‌పై భూటాన్-చైనాల మధ్య కూడా వివాదం ఉంది. కానీ, ఇది భారత్‌కు అత్యంత కీలకమైన సరిహద్దు ప్రాంతం. ఈ సరిహద్దుకు సమీపంలోని డోంగ్లియాంగ్ కాయోచాంగ్ అనే ప్రదేశం పక్కన ఉన్న డోక్లామ్‌లో చైనా నిర్మాణాలున్నాయనే కారణంతో భారత సాయుధ దళాలు, పీపుల్స్ లిబరేషన్ మిలిటరీ ఆఫ్ చైనా మధ్య ప్రతిష్టంభన నెలకొంది. డోక్లామ్‌లో చైనా సైన్యం వివాదాస్పద ప్రదేశంలో రోడ్డు నిర్మాణం చేపట్టి? భారత్ వైపుగా దాన్ని నిలిపేసింది. దీనిని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. నిర్మాణం ఆపాలని డిమాండ్ చేసింది. ఈ పరిణామం తర్వాత, 2017 జూన్ 16 నుంచి భారత్-చైనా సైనికుల మధ్య 73 రోజుల పాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 2017 ఆగస్టు 28న విదేశీ వ్యవహారాల శాఖల ముఖాముఖి చర్చల తర్వాత ఈ ప్రాంతం నుండి వైదొలగుతున్నట్లు చైనా ప్రకటించింది. ఇక, భారత్-చైనా మధ్య ప్రతిష్టంభన ముగిసే సమయానికి రెండు దేశాల సైనిక బలగాలు ఈ ప్రాంతం నుండి వెనక్కి తగ్గడానికి ఒప్పుకున్నాయి. కానీ, ఇటీవలి సంవత్సరాల్లో సేకరించిన ఉపగ్రహ చిత్రాలు చైనా అసలు స్వరూపాన్ని మరోసారి బయటపెట్టాయి. డోక్లామ్ చుట్టూ చైనా నిర్మాణాలను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ మాత్రం ఇప్పటి వరకూ స్పందించ లేదు. నిజానికి, చికెన్ నెక్ అని పిలుస్తున్న ఈ ప్రాంతం భారతదేశానికి చాలా ముఖ్యమైన ప్రాంతం. ప్రత్యేకించి ఈ వ్యూహాత్మక ప్రాంతంలో చైనా నిర్మాణాలు? చికెన్ నెక్ అయిన సిలిగురి కారిడార్‌ను కలిపే ప్రమాదం పెరుగుతుంది. ఇది భారతదేశంలోని ఇరుకైన కారిడార్‌లలో ఒకటి. పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి చుట్టూ ఉన్న చికెన్ నెక్ భూభాగాన్ని భౌగోళిక-రాజకీయ, భౌగోళిక-ఆర్థిక కారిడార్‌గా పేర్కొంటారు. ఇది ఈశాన్య భారతదేశంలోని ఏడు రాష్ట్రాలను భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలకు కలిపే కీలక ప్రవేశ ద్వారం. ఇక్కడ చైనా ప్రాభల్యం పెరిగితే అది ఈశాన్య భారత్‌లో ఉద్రిక్తతలకు కారణం అవుతుంది. ఇప్పటికే, మణిపూర్ అల్లర్లలో చైనా హస్తం ఉందనే సందేహాల మధ్య ఇక్కడ చైనా ఉనికి మరింత ప్రమాదాన్ని సృష్టించే అవకాశం ఉంది. ఇటీవలి సంవత్సరాలలో, భూటాన్ అధికారులు కూడా భూటాన్ భూభాగంలో చైనీస్ నివాసాల ఉనికిని ఖండించారు. 2016 నుండి, భూటాన్ కూడా చైనాలో భాగమేనని చైనా మొండిగా వాదిస్తోంది. ఈ భూభాగంలో మొదటిసారిగా ఒక గ్రామాన్ని నిర్మించినప్పుడు కూడా భూటాన్ వ్యతిరేకించింది. కానీ, చైనా కార్యకలాపాలను మాత్రం నిలువరించలేకపోయింది. తర్వాత, పరిణామంలో? చైనా అధికారులు 22 గ్రామాల్లో 2 వేల 284 రెసిడెన్షియల్ యూనిట్లను పూర్తి చేశారు. అలాగే, దాదాపు 7 వేల మందిని ఆ గ్రామాల్లోకి పంపించి, పూర్తి స్థాయి గ్రామాలుగా తీర్చిదిద్దారు. దీనిపైన, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ పరిశోధకులు? "ఫోర్స్‌ఫుల్ డిప్లమసీ: చైనా బోర్డర్ విలేజెస్ ఇన్ భూటాన్" అనే ప్రత్యేక రిపోర్టును తయారు చేశారు. చైనా బోర్డర్ విలేజెస్ ఇన్ భూటాన్"లో పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే.. గతంలో భూటాన్‌లో ఉన్న భూభాగంలో? చైనా దాదాపు 825 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మాణాలు చేసినట్లు తెలుస్తోంది. ఈ భూభాగం భూటాన్ మొత్తం భూభాగంలో 2% కంటే కొంచెం ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో? చైనాకు చెందిన అధికారులు, నిర్మాణ కార్మికులు, బోర్డర్ పోలీసులు, సైనిక సిబ్బంది నివాసాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక, ఈ గ్రామాల న్నీ చైనాలోని పట్టణాలకు వెళ్లే రోడ్లతో అనుసంధానించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక, 2023 ప్రారంభం నుండి ఈ ప్రాంతంలో మరో ఏడు కొత్త స్థావరాలు నిర్మించినట్లు తెలుస్తోంది. ఈ అనుబంధ ప్రాంతాల్లో మరింత వేగంగా ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. అలాగే, ఇందులో మూడు గ్రామాలను పట్టణాలుగా అప్‌గ్రేడ్ చేయబోతున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ చర్యలతో ముందుగా? భూటాన్ పశ్చిమ సెక్టార్‌లోని డోక్లామ్ పీఠభూమి, పరిసర ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం, చైనా లక్ష్యంగా తెలుస్తోంది. వీటిని ఆక్రమించుకున్న తర్వాత భారత్‌లోని పలు ఈశాన్య ప్రాంతాలపై పట్టు సాధించే ప్రయత్నాలు చేసే అవకాశం ఉంది.

## మత్స్య శాఖ వనరులను అభివృద్ధి పరచండి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 21 - జిల్లాలో మత్స్య శాఖ వనరులను అభివృద్ధి పరచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మత్స్య శాఖ ఉప సంచాలకులు రాఘవరెడ్డిని ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి ఇరిగేషన్ ఎస్ ఇ సుబ్బరాయుడు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో మత్స్యశాఖ వినియోగం పెంచడంతో పాటు వనరులను అభివృద్ధి చేయాలని మత్స్య శాఖ అధికారులను



ఆదేశించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 2020-21 నుండి 2024-25 వరకు జరిగిన ప్రగతి నివేదికలను కలెక్టర్ సమీక్షిస్తూ మత్స్య శాఖ వినియోగాన్ని జిల్లాలో విస్తృతంగా పెంచాలని కలెక్టర్ సూచించారు. ఈ పథకం కింద ఫిష్ సీడ్స్ స్టాకింగ్, టూ వీలర్స్, త్రీ వీలర్స్, ఫోర్ వీలర్స్, మినీ ఫిష్ రిటైల్ అవుట్లెట్, వ్యాల్యూ ఆడెడ్ ప్రాజెక్ట్స్, 50 లక్షల యూనిట్ ల గురించి వివరాలు అడిగి తెలుసుకుంటూ ఆక్వా హబ్ ఏర్పాటుకు కూడా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాయలసీమ జిల్లాల్లో మత్స్య వినియోగాన్ని పెంచడానికి మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్ 2047 ప్రణాళిక ప్రకారం 15 శాతం వృద్ధి సాధించాలంటే మత్స్యకారులకు అడ్వాన్సుడ్ ఫింగర్ లింగ్ చేప పిల్లలను సరఫరా చేయడానికి తగినన్ని చేప పిల్లల పెంపక కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు అనువైన భూమిని మరియు ఔత్సాహికులను గుర్తించి ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యల్పంగా చేపల పెంపకం మన జిల్లాలోనే ఉందన్నారు. మత్స్య సంపద అభివృద్ధి చెందడానికి కృషి చేయాలన్నారు.

## రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ప్రతి అర్జీని ఆన్లైన్లో నమోదు చేయండి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా---**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 21 - రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ప్రతి అర్జీని ఆన్లైన్లో నమోదు చేయడంతో పాటు రసీదును సంబంధిత అర్జీదారులకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ నుండి జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ తో కలిసి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవిన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో జరిగిన రెవెన్యూ సదస్సుల ప్రగతిని సమీక్షిస్తూ రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ప్రతి అర్జీని ఆన్లైన్లో నమోదు చేయడంతో పాటు రసీదును సంబంధిత అర్జీదారులకు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించదగ్గ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి సంబంధిత నివేదికలను పంపాలన్నారు. ఇప్పటివరకు వచ్చిన అర్జీలలో పరిష్కరించిన వాటిలో ఉత్తమైన పరిష్కారాలుగా గుర్తించిన వాటి వివరాలను పంపాలని ఆర్డిఓలను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో స్వీకరించిన ప్రతి ఒక్క అర్జీని నిర్ణీత వ్యవధిలోపల తప్పనిసరిగా పరిష్కరించాలని తెలిపారు. ఇప్పటివరకు పరిష్కార నివేదికలో ఇవ్వని మండలాలు సంబంధిత



పరిష్కార వివరాల నివేదికలు త్వరితగతిన ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సమస్యకు నాణ్యతతో కూడిన పరిష్కార మార్గాన్ని సూచించాలన్నారు. ఆర్డీఓ, తాసిల్దార్ కార్యాలయాల్లో రికార్డు రూములు సక్రమంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలు వాటి ఎండార్స్మెంట్లు ముఖ్యమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నందువల్ల ప్రతి అర్జీని నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అర్జీలను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా నిర్ణీత వ్యవధి లోపల పరిష్కరించాలన్నారు. అర్జీలు పరిష్కారంలో తలెత్తిన లోపాలను సరిదిద్దుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారులకు పెండింగ్లో ఉన్న భూసేకరణ, ఇతర పనుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ జూమ్ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీవోలు, అన్ని మండలాల తాసిల్దారులు, మండల స్పెషల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంబికా శిశు కేంద్రం సేవలు అభినందనీయం

**ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి (కర్నూలు, నంద్యాల) జస్టిస్ డాక్టర్ కె.మన్మధరావు**



కర్నూలు, డిసెంబర్ 21:- అంబికా శిశు కేంద్రంలో మానసిక వికలాంగులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి (కర్నూలు, నంద్యాల) జస్టిస్ డాక్టర్ కె.మన్మధరావు తెలిపారు.. శనివారం స్థానిక ప్రకాష్ నగర్ లోని అంబికా శిశు కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.. ఈ సందర్భంగా హై కోర్టు జడ్జి జస్టిస్ డా.కె.మన్మధ రావు మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల అవసరార్థం అనేక చట్టాలు వున్నాయని వాటిని సరైన రీతిలో ఉపయోగించి సత్వర న్యాయం పొందవచ్చునని తెలిపారు. మానసిక దివ్యాంగుల సంరక్షణ కొరకు స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం 2005 గురించి వివరిస్తూ, వీరందరికి ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని తెలియజేశారు. ట్రస్ట్ వారు చేసే సేవ కార్యక్రమాలను కొనియాడరు. ఈ సంస్థలో ఒక్కరు కాదు ఇంతమంది మానసిక వికలాంగు లకు సేవలు అందచేస్తున్న అంబికా శిశు కేంద్రం వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానని ఈ సేవలు నిరంతరం ఇదే విధంగా కొనసాగించాలని కోరారు... 7వ అదనపు జిల్లా జడ్జి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎటువంటి స్వార్థం లేకుండా, డబ్బు మీద ఆశ లేకుండా సేవలు అందించే సంస్థ అంబికా శిశు కేంద్రమన్నారు.. చేసిన బ్యాగ్‌లు, బుక్ బైండింగ్, టైలరింగ్, ప్యాకింగ్, ప్రింటింగ్ మొదలైన నైపుణ్యాలను హై కోర్టు న్యాయమూర్తులు పరిశీలిస్తూ తయారు చేసిన వారిని అభినందిం చారు.. కార్యక్రమంలో హైకోర్టు జడ్జ్ జస్టిస్ బి.వి.ఎల్.ఎన్.చక్రవర్తి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, అదనపు జిల్లా జడ్జ్ లు జి.భూపాల్ రెడ్డి, పి.పాం దురంగ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులురాయిస్ ఫాతిమా, అంబికా శిశు కేంద్రం ట్రస్ట్ దిలీప్ కుమార్ హెచ్.షా, హేమచంద్ దేవ్‌చంద్ ఛారిటీస్ ట్రస్ట్, ఎ.ఖీ.ఖ. శైలజా రావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు..


## నిశ్చితార్థ వేడుకకు హాజరైన ఏపీ ఎస్ ఎస్ డి సి ఎల్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-నవంబర్ 21 డోన్ పట్టణంలో న్యూ మధు ఫంక్షన్ హల్ నందు అడ్వకేట్ ఆంజనేయులు గౌడ్ కుమార్తె నిశ్చితార్థ వేడుకకు హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

## కేంద్ర వినియోగదారుల విద్య ,రక్షణ నిధి జాతీయ సమావేశంలో టెలి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యం ;

**డాక్టర్ బత్తుల సంజీవరాయుడు ట్రాయ్ కాగ్ మెంబర్**



న్యూఢిల్లీలో కేంద్ర టెలికమ్యూనికేషన్ వినియోగదారుల విద్య ,రక్షణ నిధి నిర్వహించిన జాతీయ సమావేశానికి డాక్టర్ బత్తుల సంజీవ రాయుడు పాల్గొని మాట్లాడుతూ దేశంలోని 28 రాష్ట్రాలలో మొబైల్ వినియోగదారులకు మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న గ్రామీణులకు నెట్వర్క్ సమస్య లేకుండా చూడాలని ,సెల్ వినియోగదారులకు సమస్యలు వచ్చినప్పుడు త్వరగా పరిష్కారం టెలి కంపెనీలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ, ప్రిన్సిపల్ అడ్వైజర్ , దండా ముస్తఫా , సంజయ్ ఆర్య , బికాస్ తాప , వెంకట్ రమణ జైన్ , సుశీల్ కుమార్, అజయ్ మహత మొదలగు అధికారులు పాల్గొన్నారు అత్యంత విలువైన జాతీయ సమావేశంలో డాక్టర్ బత్తుల సంజీవ రాయుడు పాల్గొన్నందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు , ప్రజా సంఘాలు , యువజన సంఘాలు , ప్రముఖ రాజకీయ నాయకులు తదితరులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు .

## రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవిఎం వేర్ హౌస్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా



కర్నూలు డిసెంబర్ 21:- త్రైమాసిక తనిఖీ లో భాగంగా ఈవిఎంలు భద్రపరచిన వేర్ హౌస్ ను జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా పరిశీలించారు. శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవిఎం వేర్ హౌస్ లో ఈవీఎం లను భద్రపరచిన తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈవీయం వేర్ హౌస్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గోడౌన్స్ లోని ఇంటర్నల్ పార్టిషన్లకు ప్రస్తుతం ఉన్న తాళాల కంటే పెద్ద తాళాలు వేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ వెంట డిఆర్వో సి.వెంకటనారాయణమ్మ,, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మురళి, తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రెటరీ ఎల్.వి.ప్రసాద్,బిజెపి స్టేట్ ఎలక్షన్ సెల్ ప్రతినిధి సాయి ప్రదీప్,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కె.పుల్లారెడ్డి,కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి షేక్ ఇజాజ్ అహ్మద్, బీఎస్పీ ప్రతినిధి అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన కార్యాలయంలో జనవాణి కార్యక్రమం

మంగళగిరి,మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జనవాణి జనసేన భరోసా కార్యక్రమాన్ని కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి చేపట్టారు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుండి ప్రజలు సమస్యలతో ఇబ్బంది పడుతున్న తరుణంలో విషయం తెలుసుకొని ప్రజల సమస్యల పరిష్కార వేదికగా జనసేన అధినేత రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ చేపట్టిన జనవాణి కార్యక్రమంలో తుమ్మల రామస్వామి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు...

# పేర్ని నాని కేసులో కదలిక

విజయవాడ, డిసెంబర్ 21, మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబానికి చెందిన గోడౌన్ నుంచి రేషన్ బియ్యం మాయం ఘటనలో.. పోలీసు, పౌరసరఫరాలశాఖల్లో కొంత కదలిక వచ్చింది. గోదాము నిర్వాహకులైన మాజీమంత్రి పేర్ని నాని కుటుంబానికి చెందిన వ్యక్తులు విదేశాలకు పారిపోకుండా.. పోలీసులు లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. అసలు వాస్తవంగా గోడౌన్‌లో మాయమైన బియ్యమెంతో తేల్చే ప్రక్రియను పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రారంభించారు. కేసులో నిందితులు బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా ఆ పిటిషన్ విచారణకు వచ్చి 19వ తేదీకి వాయిదా పడింది. వైసీపీకు చెందిన మాజీమంత్రి కుటుంబ సభ్యులపై కేసు విషయంలో ఇంత జరుగుతున్నా.. కూటమి నేతల మౌనం విస్తుగొలిపేలా ఉంది. ఈ విషయంలో కొందరు మంత్రులు, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజాప్రతినిధులకు నిజంగా సత్కారం చేయాల్సిందేననే విమర్శలు అధికార పార్టీల కార్యకర్తల్లో కొనసాగుతున్నాయి.మాయమైన బియ్యానికి సంబంధించి జరిమానాతో కలిపి డబ్బు కట్టమని అధికారులు నోటీసు ఇవ్వడంతో.. పేర్ని నాని కుటుంబసభ్యులు తొలి విడతగా ఈ నెల 13న రూ.కోటి మొత్తానికి మూడు డీడీలు సమర్పించారు. సోమవారం మరో రూ.70 లక్షలకు డీడీలు ఇచ్చారు. మొత్తంగా రెండు విడతల్లో రూ.1.70 కోట్ల డీడీలు అధికారులకు అందించారు. అంటే జరిమానాతో కలిపి సొమ్ము చెల్లించామని చెప్పి కేసు నుంచి తేలిగ్గా బయటపడే అవకాశాన్ని అధికారులే కల్పించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బెయిల్ తెచ్చుకుని బయటపడేందుకు శక్తిమేర సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారుల ఉదాసీన వైఖరే దీనంతటికీ కారణమంటున్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన వ్యక్తి కుటుంబానికి సంబంధించిన గోడౌన్ వ్యవహారం కావడం, కృష్ణా జిల్లాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కూడా ఆయనకే అనుకూలమనే సంకేతాలు ఉండడంతో.. జిల్లాస్థాయి అధికారులు తమకెందుకొచ్చిన గొడవని ఎవరికి వారే కేసు తీవ్రత తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.టీడీపీ,జనసేన నేతలపై తీవ్ర విమర్శలతో విరుచుకుపడే పేర్ని నాని కుటుంబానికి సంబంధించిన గోడౌన్‌లో 3,708 బస్తాల రేషన్ బియ్యం మాయమైనా.. పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆ ఛాయలకే పోలేదు. పర్యటనలకు వెళ్తే చాలు, సూపర్‌బజార్లు, రైస్ మిల్లులు, పోర్టుల్లో గోదాములను తనిఖీలకు ఉపక్రమించే ఆయన.. ఈ గోడౌన్ జోలికి



వెళ్లకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతుంది. ప్రెస్‌మీట్లు పెట్టి వైసీపీ నేతలపై విమర్శలు చేసే హోంమంత్రి అనిత.. పేదల బియ్యాన్ని మాయం చేసినందుకు అదే వైసీపీకి చెందిన పేర్ని నాని కుటుంబ సభ్యులపై కేసు నమోదైనా, ఇప్పటికీ అరెస్టు చేయకపోయినా .. నోరు మెదపక పోవడానికి కారణమేంటని కూటమి కార్యకర్తలు ప్రశ్నలు సంధిస్తున్నారు.తమ గోదాములో బియ్యం మాయమయ్యాయని పేర్ని నాని కుటుంబ సభ్యులు లేఖ ఇచ్చి 20 రోజులు అవుతున్నా.. వాస్తవంగా మాయమైన బియ్యం పరిమాణం ఎంతనేది ఇప్పటికి స్పష్టమైన లెక్కలు లేవు. తాజాగా సోమవారం అధికారులు గోదాము వద్దకు చేరుకోగా.. సంస్థ సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో న్యాయవాది సమక్షంలో పంచనామా చేసి.. తాళాలు పగలగొట్టి లోనికి వెళ్లారు. బియ్యం నిల్వల వివరాలు సేకరిస్తున్నారు. అక్కడున్న వేబ్రిడ్జి పనిచేయడం లేదంటూ.. బియ్యాన్ని మరోచోట తూకం పెట్టించి తరలించే ప్రక్రియ ప్రారంభించారు.మాయమైన బియ్యం లెక్కలు.. అంచనాకంటే ఎక్కువే ఉన్నట్లు తెలుస్తోంది. తూకంలో తేడా కారణంగా తొలుత 3,200 బస్తాల బియ్యం తగ్గాయని తొలుత పేర్ని కుటుంబ సభ్యులు అధికారులకు లేఖ రాశారు. అధికారులు అక్కడకు వెళ్లి ఖాతా పుస్తకాలు పరిశీలించగా.. 3,708 బస్తాలు తగ్గాయని ప్రాథమికంగా అంచనా వేశారు. బియ్యాన్ని తరలించే సందర్భంగా పరిశీలించగా.. ఇప్పటికే చెప్పిన పరిమాణం కంటే మరింత భారీగా మాయమైనట్లు బయటపడుతోంది. అసలు గోదాము నుంచి రేషన్ బియ్యం ఎప్పుడు మాయమయ్యాయనే వివరాలు ఇప్పటికీ తేల్చలేదు.చౌక బియ్యం మాయమైన వ్యవహారంలో ఈ నెల 10న గోదాము యజమాని పేర్ని జయసుధ, మేనేజర్ మానస్ తేజపై పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. దీనిపై 13న జయసుధ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. గురువారానికి వాయిదా వేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ప్రత్యేక పీపీని నియమించాల్సి ఉందని న్యాయవాదులు వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన ఏపీపీనే ఇప్పటికీ కొనసాగించడం గమనార్హం. ఈ కేసులో ప్రధాన నిందితురాలు జయసుధ విదేశాలకు వెళ్లకుండా లుక్ ఔట్ నోటీసులు జారీ చేసినట్లు ఎస్పీ గంగాధరరావు పేర్కొన్నారు.బియ్యం మాయమైన ఘటనలో కేసు నమోదైన నాటి నుంచి పేర్ని నాని అజ్ఞాతంలోకి వెళ్లారు. జిల్లా వైసీపీ అధ్యక్షునిగా ఉన్న నాని, నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న ఆయన తనయుడు కిట్టు పార్టీ కలెక్టరేట్ వద్ద చేపట్టిన పోరుబాట కార్యక్రమంలోనూ కనిపించలేదు. మాయమైన బియ్యానికి జరిమానాగా రూ. 1.70 కోట్లు చెల్లించిన నేపథ్యంలో.. తాజాగా నాని సోమవారం మధ్యాహ్నం తన నివాసంలో ప్రత్యక్షమవ్వడం చర్చనీయాంశంగా మారింది. పెనాల్టీ కొట్టేయడంతో ఇక కేసు నుంచి బయట పడవచ్చన్న ధీమాతోనే ఆయన బయటకు వచ్చారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

# చెల్లెల్లికి చెక్ పెట్టేలా వ్యూహం

విజయవాడ, అనంతపురం, డిసెంబర్ 21, ఏపీ రాజకీయాలు ట్విస్ట్‌లతో ఎప్పుడూ ఆసక్తిగానే ఉంటాయి. కూటమి ప్రభుత్వం జగన్‌ను టార్గెట్ చేస్తూ వ్యూహాలు అమలు చేస్తోంది. ఇటు పీసీసీ చీఫ్ షర్మిల సైతం జగన్ లక్ష్యంగా వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారు. ఇంకోవైపు ముఖ్యనేతలంతా వైసీపీని వీడుతున్నారు. మొత్తానికి వైసీపీకి గడ్డు రోజులు నడుస్తున్నాయి అనుకునేలా ఉంది పొలిటికల్ సిచ్యువేషన్.. ఇలాంటి టైమ్‌లో వైఎస్ జగన్ తన మార్క్ రాజకీయం మొదలుపెట్టబోతున్నారని సమాచారం. పార్టీని బలోపేతం చేసేందుకు, క్యాడర్‌లో జోష్ నింపేందుకు సరికొత్త వ్యూహంతో వస్తున్నారంట ఆయన.ఓ వైపు జిల్లాల పర్యటనలకు ప్లాన్ చేస్తూనే.. మరోవైపు పొలిటికల్ గేమ్‌కు తెరతీశారు జగన్. పీసీసీ చీఫ్ సీటు నుంచి షర్మిలను తప్పించేందుకు జగన్ స్కెచ్ వేసినట్లు పొలిటికల్ సర్కిళ్లలో టాక్ వినిపిస్తోంది. బెంగళూరులో ఉంటూనే ఢిల్లీ కేంద్రంగా పావులు కదుపుతున్నారట. కూటమి నేతలతో పాటు షర్మిల ప్రతీ సందర్భంలోనూ జగన్‌ను టార్గెట్ చేస్తున్నారు. దీంతో కూటమి నేతలతో పాటు షర్మిలకు కూడా చెక్ పెట్టాలని జగన్ డిసైడ్ అయినట్లు కనిపిస్తున్నారు.ఇప్పటికే షర్మిల నాయకత్వంపై కాంగ్రెస్ సీనియర్లు వ్యతిరేక స్వరం వినిపిస్తున్నారు. పార్టీ బలోపేతాన్ని గాలికి వదిలేసి.. కుటుంబ ఆస్తుల లొల్లినే పట్టుకున్నారని కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంపై కాకుండా జగన్‌పై వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఫిర్యాదులు హైకమాండ్‌కు వెళ్లాయి. ఈ లొసుగును పట్టుకొని పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు స్కెచ్ వేశారనే గాసిప్ లోకల్‌గా షికారు చేస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ ముఖ్యులతో మంత్రాంగం ప్రారంభించారు.మరోవైపు ఖాళీ అవుతున్న వైసీపీకి బలం పెంచేలా వ్యూహాలు రచిస్తున్నారు. కాంగ్రెస్‌లో ఉన్న సీనియర్లను తనవైపు తిప్పుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. తన తండ్రి వైఎస్సార్‌తో పని చేసి.. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్న నేతలతో జగన్ టచ్‌లోకి వెళ్తున్నారట. అందులో భాగంగానే కర్నూలులో జరిగిన ఓ పెళ్లి వేడుకలో పీసీసీ మాజీ చీఫ్ శైలజానాథ్‌ను జగన్ కలిశారట. ఆయనతో పాటు 8 మంది కాంగ్రెస్ సీనియర్లు వైసీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. వీరంతా కూటమిలోకి వెళ్లడం ఇష్టం లేక, షర్మిల నాయకత్వంలో పని చేయలేక అసంతృప్తిగా ఉన్నారట. ఇదే సమయంలో వాళ్లను జగన్ వైసీపీలోకి ఆహ్వానించడంతో ఆ నేతలు కాదనలేకపోయారని సమాచారం. మరి ఈ పరిణామాలు, జగన్ వ్యూహాలు షర్మిల రాజకీయానికి చెక్ పెడ్తాయా? వైసీపీకి కలిసొస్తుందా? అనేది ఇంట్రెస్టింగ్ చర్చగా మారింది.

# భీమిలీలో నేతల సిగపట్లు

విశాఖపట్టణం, డిసెంబర్ 21, వైసీపీని వలసలు వేధిస్తున్నాయి. మొన్నటి వరకు పార్టీకి బలంగా ఉన్న నేతలు కూడా చెట్టుకొకరు, పుట్టకొకరు ఐపోతున్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు ఇప్పుడు వర్గపోరు కూడా తోడైంది. ఇది చాలదన్నట్టు ఖాళీ అయిన నియోజకవర్గంలో ఇన్‌చార్జ్ పోస్ట్ కోసం ఆశావహులు కన్నేస్తున్నారు. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన భీమిలిపై ఇప్పుడు ఇద్దరు నేతల కన్ను పడింది.వైసీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఇంతవరకు పలానా నియోజకవర్గం ఫిక్స్ అంటూ ఏమీ లేదు. దీంతో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. నియోజకవర్గం వెతుక్కోవాల్సిన దుస్థితి వస్తోంది. 2014-అనకాపల్లి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో అనకాపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. మొన్నటి ఎన్నికల్లో గాజువాక నుంచి పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఆయనకు ఇప్పుడు ఏ నియోజకర్గంలో యాక్టివ్‌గా ఉండాలో తోచడం లేదు. పొలిటికల్ చౌరస్తాలో నిలబడి దిక్కులు చేస్తున్నారు. ఇంతలో ఆయనకు ఊహించని లక్కీ చాన్స్ ఎదురైంది. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ పార్టీ నుంచి వెళ్లిపోవడంతో భీమిలి వైసీపీ సీటు ఖాళీ అయ్యింది.. దీంతో అమర్‌నాథ్ కన్ను భీమిలీపై పడిందని వైసీపీ వర్గాల ఇన్నర్ టాక్. అంతేకాదు భీమిలి ప్రజలతో టచ్‌లోకి వెళ్లడం, జిల్లా రాజకీయాలను ఫుల్‌గా స్టడీ చేయడం కూడా మొదలుపెట్టారంట అమర్‌నాథ్..గుడివాడ అమర్‌నాథ్ కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. భీమిలీలో కాపుల ఓటు బ్యాంక్‌కు కొదవే లేదు. ఇది తనకు బాగా కలిసొస్తుందని అమర్‌నాథ్ లెక్కలు వేసుకుంటున్నారు. పార్టీలను పక్కన పెడితే.. భీమిలి నుంచి కొంతకాలంగా కాపు లీడర్లే గెలుస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న గంటా శ్రీనివాసరావు కావచ్చు.. అంతకుముందు ఎమ్మెల్యేగా గెలిచిన అవంతి శ్రీనివాస్, అంతకుముందు కర్రి సీతారామ్.. ఇలా చెప్పుకుంటే పోతే.. కాపుల నాయకుల పేర్లే కనిపిస్తున్నాయి. యాదవ సామాజికవర్గం, క్షత్రియుల ప్రాబల్యం ఉన్నప్పటికీ కాపులనే ఫాలో అవుతారని పొలిటీషియన్స్ లెక్క. దీనిని పసిగట్టిన అమర్‌నాథ్.. భీమిలి సీటుపై కర్చీఫ్ వేసుకోవాలని చూస్తున్నారట..అంతేగాక భీమిలి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలు తన తాత అప్పన్న, తండ్రి గుర్నాథరావు ప్రాతినిధ్యం వహించిన సింహాచలం, మధురవాడ ప్రాంతాలు కూడా కలిసి ఉన్నాయి. ఇది కూడా తనకు ప్లస్ పాయింట్ అవుతుందనే ఈక్వేషన్స్‌తో అమర్‌నాథ్ భీమిలి వైపు వెళ్తున్నారని లోకల్ టాక్.. అంతేకాదు ఆ టికెట్ దక్కితే తన పొలిటికల్ ఫ్యూచర్‌కు ఢోకా ఉండదనే భావనలో ఆయన ఉన్నారనే తెలుస్తోంది.ఐతే భీమిలి భీముడిని తానే అంటూ ఊహల్లో విహరిస్తున్న అమర్‌నాథ్‌కు పిడుగులాంటి వార్త చెవిన పడిందట. అదే భీమిలి స్థానంపై పొరుగు జిల్లా నేత కూడా కన్నేశారనేది.. ఆయన వస్తే తన సీటుకు ఎసరు వస్తుందని అమర్‌నాథ్ డైలామాలో పడిపోయారని విశాఖ లోకల్ పాలిటిక్స్‌లో వినిపిస్తున్న గాసిప్. విజయనగరం జిల్లాకు చెందిన మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను భీమిలి సీటుపై గురిపెట్టారట. ఈయన మరెవరోకాదు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు స్వయాన మేనల్లుడు. బొత్సకు రాజకీయాల్లో చేదోడు వాదోడుగా ఉంటూనే, జిల్లా రాజకీయాల్ని శాసిస్తుంటారని పేరుంది. వైసీపీ అధినేత జగన్‌కు కూడా కాస్త సన్నిహితంగా కనిపిస్తారు. ఇక ఈ విషయం తెలిసినప్పటి నుంచి అమర్‌నాథ్‌కు కంటిమీద కునుకు ఉండడం లేదట.విజయనగరం జిల్లాకు చెందిన చిన్న శ్రీను, విశాఖకు ఎందుకు వస్తున్నారనే అనుమానాలు కూడా లేకపోలేదు. అసెంబ్లీ లేదా పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహించాలని చిన్న శ్రీనుకు ఎప్పటి నుంచో కోరిక ఉంది. టికెట్ వచ్చినట్టే వచ్చి చేజారిపోతుంది. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో చాన్స్ మిస్ చేసుకోవద్దనే ఆలోచనలో ఉన్నారట చిన్న శ్రీను. విజయగనరం జిల్లాలో ఇప్పటికే బొత్స కుటుంబీకులు చాలా స్థానాల్ని గుప్పిట్లో పెట్టుకున్నారు. ఎక్కడా ఖాళీ లేక చిన్న శ్రీను చూపు భీమిలిపై పడిందని టాక్ నడుస్తోంది.క్యాస్ట్ ఈక్వేషన్స్‌పై గుడివాడ అమర్ ఆశలు పెట్టుకున్నట్లే.. చిన్న శ్రీను కూడా సేమ్ లెక్కలు వేసుకున్నారు. పైగా నియోజకవర్గంలోని మూడు మండలాల్లో చిన్న శ్రీను బంధుగణం ఉంది. దీంతో భీమిలి బెటర్ ఆప్షన్‌గా ఫీలవుతున్నారట చిన్న శ్రీను.మొత్తానికి అవంతి శ్రీనివాస్ వదిలి వెళ్లిన భీమిలి స్థానాన్ని ఎవరికి కేటాయించాలని వైసీపీ అధినేత జగన్ డైలామాలో ఉన్నారని పార్టీలో ఇన్నర్ టాక్. గుడివాడ అమర్, చిన్నశ్రీను ఇద్దరూ మాజీ సీఎం జగన్‌కు చాలా క్లోజ్‌గా ఉంటారు. మరి ఈ ఇద్దరిలో ఎవరిని వద్దన్నా.. అసంతృప్త స్వరాలు వినిపించేలా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో హైకమాండ్ నిర్ణయం ఎలా ఉంటుందోనన్నది ఉత్కంఠగా మారింది.

# బయటకొస్తున్న జగన్ జల్సాతనం



విజయవాడ, డిసెంబర్ 21,జగన్‌కు సంబంధించి కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆయన ఖర్చు చూస్తుంటే అధికారులు షాకవుతున్నారు. ప్రజా ధనాన్ని ఈ విధంగా చేయవచ్చా అంటూ నోరు వెళ్లబెడుతున్నారు. ఏపీని వైసీపీ 2019-24 వరకు పాలించింది. ప్రభుత్వం ఎలాంటి జీవోలు జారీ చేసినా సీక్రెట్‌గా ఉంచేది. బయటకు రాకుండా చూసేది అప్పటి యంత్రాంగం. కొందరు న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు. అయినా అధికారుల్లో మాత్రం చలనం రాలేదు.వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత జగన్ విలాసాలు ఒకొక్కటిగా బయటకు వస్తున్నాయి. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జీతంగా కేవలం ఒక్క రూపాయి మాత్రమే తీసుకునేవారు. జగన్ నిర్ణయాన్ని చాలామంది స్వాగతించారు. ఎన్టీఆర్ తర్వాత ఆ విధంగా తీసుకున్నవారిలో జగన్ మాత్రమేనని తెగ డప్పుకొట్టారు.టీడీపీ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది. అందులో కీలక విషయాలు బయటపెట్టింది. 20 లక్షలు ఖర్చుకాని హెలిప్యాడ్ నిర్మాణం కోసం ఏకంగా రూ.8.60 కోట్ల కేటాయించారట. ఏ రేంజ్‌లో జల్సాలు చేశారో అంటూ రాసుకొచ్చింది. ప్రపంచంలో ఏ నియంత ఇలాగ చేసి ఉండరేమో!నని రాసుకొచ్చింది.ప్రజా సేవ చేయాలని అధికారమిస్తే దాన్ని అడ్డు పెట్టుకుని ఎంతకు తెగించారో కళ్లకు కట్టినట్టు చూపించింది. ఇంటి చుట్టుపక్కలే కాదు.. హెలికాప్టర్ ఎక్కేచోటు జనం కనిపించకూడదని ప్రత్యేకంగా హెలిప్యాడ్ నిర్మించారని రాసుకొచ్చింది.ఇంకాస్త వెనక్కి వెళ్తే.. జగన్ ఐదేళ్ల పాలనలో చేసిన ఖర్చును ఒకొక్కటిగా బయటకు తీస్తోంది కూటమి సర్కార్. కేవలం ఎగ్ పఫ్స్ కోసం దాదాపు 3.62 కోట్లపైగానే ఖర్చు చేసింది. ఈ విషయం తెలిసి ఏపీ ప్రజలు షాకయ్యారు. ఇక పేపర్, పెన్ను ఖర్చుల కోసం ఏకంగా 9.84 కోట్లు ప్రజాధనం వృథా చేశారని బయటపెట్టింది కూటమ సర్కార్.అందుకు సంబంధించి జీవోను బయటపెట్టింది. ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. ఇక తాడేపల్లి ప్యాలెస్ కోసం ఇంటి చుట్టూ ఇనుప కంచె నిర్మాణం చేశారు. దానికి ఖర్చు అక్షరాలా 12.85 కోట్ల రూపాయలు. కంచె బరువు ఈశాన్య బరువు పెరిగిందని పండితులు చెప్పడంతో దాన్ని తొలగించే పనిలో పడ్డారట.ఇవన్నీ గమనిస్తున్న ప్రజలు ఒక్క రూపాయి జీతం ఎందుకు తీసుకున్నారో ఇప్పుడిప్పుడే అర్థమవుతుందని అంటున్నారు. మాజీ సీఎంకు సంబంధించి ఇంకెన్ని విషయాలు వెలుగులోకి వస్తాయో చూడాలి. జగన్ ఖర్చులన్నీ చూసిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన ఆలోచనను మార్చుకున్నట్లు కొందరు చెబుతున్నారు. అందుకోసమే జీతం తీసుకోవడానికి పవన్‌కల్యాణ్ అంగీకరించారని అంటున్నారు.

# ఘనంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

- ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం న్యాయం కోసం పోరాటాలకు సిద్ధంగా ఉన్నాం
- మోసపు వాగ్దానాలతో ప్రజలను దగా చేసిన టిడిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

నంద్యాల,పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నివాసంలో మాజీ ముఖ్యమంత్రి జననేత వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఎమ్మెల్సీ ఇసాక్ బాషా అధ్యక్షతన మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, నంద్యాల మండల అధ్యక్షుడు శెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. వైయస్ జగన్మోహన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వైఎస్ఆర్సిపి నాయకులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు కోరారు. కేక్ కట్ చేసి సంబరాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పరితపిస్తూ ప్రజల పక్షాన నిలిచిన జననేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ముందుకు వెళతామని వారి నాయకత్వం వర్ధిల్లాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ప్రజలకు అనేక వాగ్దానాల ఇచ్చి వాటిని అమలు చేయకుండా విస్మరించి ప్రజలను మోసం, దగా చేశారని విమర్శించారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను మాట తప్పక మడమ తిప్పక నెరవేర్చిన నాయకుడని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా తాను ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేనని చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం నాయకులు రోజుకో రంగులు మారుస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఇసుక విధానాన్ని అమలు పరచడంలో దారుణంగా వైఫల్యం చెందారని విమర్శించారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నా..ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం ప్రజలతో ఉంటామని పోరాటాలు చేస్తూ ప్రజలకు న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అడుగుజాడల్లో అంకితభావంతో నడుస్తామని తెలిపారు. రానున్న కాలంలో తిరిగి వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారం చేపట్టబోతుందని, జననేత జగన్ అన్నకు నీరాజనాలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల్లోకి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాబోతున్నారని జన సునామీని మరోసారి సృష్టించబోతున్నారని తెలిపారు. ఇకనైనా ప్రజలకు మోసపు వాగ్దానాలను చెప్పి అమలుకు నోచుకోని టిడిపి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అండగా ఉంటుందని, సువర్ణ రాజ్యం, జగనన్న రాజ్యం, రాజన్న రాజ్యం రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైసీపీ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి ,దేశం సుధాకర్ రెడ్డి ,రామలింగారెడ్డి, దాల్మిల్ అమీర్ , డా. శశికళ రెడ్డి, వైసీపీ కౌన్సిలర్లు ఆరిఫ్ నాయక్, కలాం భాష, చంద్రశేఖర్ రెడ్డి, మేస చంద్రశేఖర్ , సాదిక్ భాష, బాసిద్ ,కోఆప్షన్ సభ్యులు సలాముల్ల, వార్డు వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ, కిరణ్, పార్థుడు ,సోమశేఖర్ రెడ్డి, రామచంద్రుడు, కాలువ నాగరాజు, ఎద్దు రవి, దేవ నగర్ బాషా, జాకీర్ హుస్సేన్, టీవీ రమణ, గన్ని కరీం,జలీల్, చింత శ్రీనివాసులు, సాయిరాం రెడ్డి,దండే సుధాకర్ ,కుమ్మరి రాముడు ,శంకర్ నాయక్ ,రామచంద్రుడు ఎస్సీ సెల్, కాసిం, కారు రవి, టైలర్ శివ ,ఎర్రన్న, చల్ల సత్యం, బషీర్, లాల్ బాషా, మరియు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# కాకినాడు లో జగన్ జన్మదిన వేడుకలు

కాకినాడ,మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి 52వ పుట్టినరోజు వేడుకలు కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు.. కాకినాడ రమణయ్యపేటలోని క్యాంపు కార్యాలయంలో కాకినాడ జిల్లా వైసిపి అధ్యక్షులు,మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి నియోజకవర్గంలోని పెద్ద ఎత్తున వైసిపి అభిమానులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి మాజీ ముఖ్యమంత్రి జగన్ కి శుభాకాంక్షలు తెలిపారు..ఈసందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి సొంతంగా పార్టీని స్థాపించి ప్రజల పక్షాల పోరాటం చేస్తూ గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు ఎన్నో సంక్షేమం,అభివృద్ధి పదాలు అందించి భారతదేశంలోనే బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని అలాంటి నాయకుడుకి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

శ్రీ సత్య సాయి జిల్లా,శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం బుల్ల సముద్రం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గుడిబండ మండలం కెఎన్ పల్లి గ్రామానికి చెందిన పదిమంది యాత్రికులు బుళ్ళసముద్రం సమీపంలో తిరుపతి నుండి టెంపో ట్రావెలర్స్ వాహనంలో తిరిగి వస్తు ముందు ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో నలుగురు మృతి చెందారు. మిగతా వారికి తీవ్ర గాయాలు అయ్యాయి.రత్నమ్మ, మనోజ్ , అతర్వ ప్రేమ కుమారి లు రు అక్కడికక్కడే మృతిచెందారు మిగతా వారందరూ మడకశిర ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. గాయాపడ్డవారు కేంపన్న, కేంచమ్మ, గీత లక్ష్మి, సుజాతమ్మ, గిరిజమ్మ, నాగమణి, ఉష. అమాజఅమ్మ, శ్రీదేవి శ్వేత. డ్రైవర్.. తుది శ్వాసతో కొట్టుమిట్టాడుతున్నాడు..

## జనసంద్రం మధ్య జననేత జగనన్న పుట్టినరోజు వేడుకలు



విభారే న్యూస్..ఎమ్మిగనూరువై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక ఆధ్వర్యంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి జన్మదినాన్ని పురస్కరించుకొని పలు సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుట్టా శివ నీలకంఠ, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, అనుబంధ విభాగాల రాష్ట్ర వీర శైవ లింగాయత్ అధ్యక్షులు రుద్ర గౌడ్ గార్లు, మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి పుట్టినరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు పండుగల కనిపిస్తుందని, జగన్మోహన్ రెడ్డి గారు ఎల్లవేళలా బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలని ఎన్నో పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుంది అని అన్నారు. పుట్టినరోజు సందర్భంగా.వైయస్ విగ్రహానికి పూలమాల వేసి భారీ జనసంద్రం మధ్య కేక్ కట్ చేశారు. బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ

## ఆదివారంభాను సప్తమి సందర్భంగా శ్రీసూర్య నారాయణ స్వామి వారికి విశేషంగా అరుణపారాయణ రుద్ర అభిషేకం

విభారే న్యూస్... డిసెంబర్ 21కర్నూల్ ప్రతినిధి.... ఏ రోజు అయితే ఆదివారం సప్తమి తిథి కలిసి వస్తుందో ఆరోజు భాను సప్తమి అంటారు .దానినే విజయ సప్తమి లేదా కళ్యాణ సప్తమి అంటారు.భాను సప్తమి రోజు చేసే సూర్య ఆరాధన అత్యంత ఫల ప్రదము విద్య వ్యాపార అభివృద్ధి జరుగుతుంది.నిరుద్యోగులకు ఉద్యోగం లభిస్తుంది అవివాహితులకు వివాహం అవుతుంది సంతానం కలుగుతుంది మనశ్శాంతి లభిస్తుంది .భాను సప్తమి సూర్యుడికి సంబంధించిన పర్వదినం ఆ రోజున చేసే పూజ,దాన,జప,హోమ ఫలం విడి రోజులలో చేసిన ఫలితం కంటే లక్ష రెట్లు ఎక్కువగా ఫలితం లభిస్తుంది.ఈ పూజలు అనంత కోటి ఫలితాలను ఇస్తాయి. ధనుర్మాసం సందర్భంగా స్వామి వారికి రేపు తులసి మాలలతో విశేష అలంకరణ చేయడం జరుగుతుంది. తులసి మాలాల కొరకు భక్తులు ధన రూపేణ సహకరించగలరు.అభిషేక సంకల్పం :-116/-అభిషేకం:- 1116/-హోమ సంకల్పం:-116/-ప్రధాన హోమం 3500/- సంప్రదించిన నెం:9550106332
googlepay &phone pay -8896123777
Office landline No08518-234388

## ఏకగ్రీవంగా ఎన్నికైన తెలుగు గంగ ప్రాజెక్టు చైర్మన్, వైస్ చైర్మన్లు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 21 - నంద్యాలలో సాగునీటి సంగం ఎన్నికలలో భాగంగా తెలుగుగంగ ప్రాజెక్ట్ బిసి4 చైర్మన్ గా ఏకగ్రీవంగా సంజీవ్ కుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ గా మనోహర్ చౌదరి ఎన్నికయ్యారు. శనివారం తెలుగుగంగ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో వారు మాట్లాడుతూ మాకు సహాయ సహకారాలు అందించిన సీఎం చంద్రబాబు నాయుడుకు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియకు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. రైతులకు సకాలంలో నీటిని అందించి వారి అభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



# సిపిఐ శత జయంతి ఉత్సవాలను పండుగలా నిర్వహించాలి---



**కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు---**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 21 - సీపీఐ పార్టీని బలోపేతం చేయడమే కార్యకర్తల లక్ష్యం కావాలని, సిపిఐ శత జయంతి ఉత్సవాలను పండుగలా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమితి సమావేశాలు జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురాంమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముప్పాళ్ళ నాగేశ్వరావు మాట్లాడుతూ సిపిఐ పార్టీ 1925 సంవత్సరం డిసెంబర్ 26న ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తయిందని, శత వసంత వేడుకలను ఒక పండుగలా గ్రామస్థాయి నుండి నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై బలమైన సంబంధాలను ఏర్పరచుకున్నప్పుడే పార్టీ నిర్మాణం బలోపేతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. సిపిఐ పార్టీకి పదవులు, అధికారం ముఖ్యం కాదని, ప్రజలు, ప్రజా సమస్యలే ముఖ్యమన్నారు. తెలంగాణలో భూ పోరాటం చేసి పది లక్షల ఎకరాలను సేకరించి పేదలకు పంచిన ఘన చరిత్ర సిపిఐ పార్టీదన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల హామీల్లో ఇచ్చిన వాగ్దానాల అమలుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని, పేదల ఇళ్ల కోసం సచివాలయ వద్ద అర్జీల కార్యక్రమం విజయవంతమైందని, రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు పట్టణ ప్రాంతంలో సాధించేవరకు సిపిఐ పార్టీ పేదలకు అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలపై పార్టీ శ్రేణులు ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేయాలని చేయాలని ఆయన పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలపై పార్టీ శ్రేణులు నిరంతరం పోరాటాలు చేయాలన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా వాలంటీర్లకు పదివేల రూపాయలు ఇస్తామన్న తెలుగుదేశం నాయకుల హామీలు ఏమయ్యాయని ఆయన నిలదీశారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన త్యాగపూరితమైన కమ్యూనిస్టు పార్టీ చరిత్ర శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడుమాట్లాడుతూ జిల్లాలో శత జయంతి వారోత్సవాలు పార్టీ శాఖలున్న ప్రతి చోట పార్టీ పతాకావిష్కరణ నిర్వహించి, ఘనంగా పండగ వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాలలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. సుంకయ్య, కె. రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి కే. ప్రసాద్, ఆళ్లగడ్డ తాలూకా కార్యదర్శి కే భాస్కర్,ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ రాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనంజయుడు,జిల్లా సమితి సభ్యులు ప్రభాకర్, శివయ్య, హరినాథ్, సామేలు, సంజీవులు, సుబ్బారెడ్డి, సోమన్న, శ్రీనివాసులు, ప్రతాప్, వెంకట్ శివుడు, భార్గవ్, బాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు లక్ష్మీదేవి, షమీం బేగం, రజిత, గోస్పాడు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# గాజులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 21 - శనివారం గాజులపల్లి ఆరోగ్య కేంద్రమును జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ ఆకస్మికముగా తనిఖీ చేశారు . ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది సమయ పాలన తప్పని సరిగా పాటించాలని లేనిచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు . ఈ తనిఖీ లో భాగముగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రము లోని ఒపి విభాగాన్ని మరియు అక్కడ వున్నటువంటి రోగులకు,వారికి అందె సేవలు మరియు చికిత్సలు,మందులు, వారి పట్ల వైద్యాధికారి మరియు వైద్య ఆరోగ్యసిబ్బంది ఎలా వ్యవహరిస్తున్నారు ఒపి విభాగములోని రికార్డులను మరియు రిపోర్టులను తనిఖీ చేశారు. పీఎమ్ జేవై కార్డ్ ఎనరోల్ వెంంట్ ఈకేవైసీ ని తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రములో జాతీయ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ కార్యక్రమాల ఎఇఅ మెటీరియల్ ప్రదర్శన ను అవగాహన కొరకు ప్రజలకు మరియు రోగులకు అందుబాటులో ఉండే విధము గా ప్రదర్శించవలేనని లేనిచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించడమైనది. కాన్పు వార్డును పరిశీలించి కాన్పు కొరకు వచ్చే ప్రతి గర్భిణీ స్త్రీ ని వీలైనంత వరకు నార్మల్ కాన్పు అయ్యే విధముగా జాగ్రత్త వహించవలేనని సూచించారు . బాలింత స్త్రీ కి మరియు పుట్టిన బిడ్డకు అవసరమైన సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వారికి రావలసిన రాయితీలు సరైన సమయములో అందించవలేనని లేనిచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు .మందుల గది ని తనిఖీ చేసి అందులో రికార్డులను పరిశీలించారు. ల్యాబ్ ను,వ్యాధినిరోధక టీకాల గదిని తనిఖీ చేశారు.

## కొనుగోలు చేసిన ప్రతి వస్తువు కి బిల్లు తీసుకోవాలి





విభారే న్యూస్ లో మా ప్రతినిధి:-నవంబర్ 21 వస్తువులు కొనుగోలు చేస్తే బిల్లు డిమాండ్ గా అడగండి జాతీయ వినియోగదారుల వారోత్సవాలు కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ అధ్యక్షతన వినియోగదారుల రక్షణ హక్కులు డిజిటల్ చెల్లింపులపై మరియు వస్తువులు కొనుగోలు చేస్తే ఖచ్చితంగా బిల్లు అడిగి డిమాండ్ చేయండి అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన వకృత పోటీలు ఏర్పాటు చేసి అదేవిధంగా వినియోగదారుల హక్కులపై గ్రామ ప్రజలను చైతన్యవంతులను చేస్తామని విద్యార్థిని విద్యార్థుల ద్వారా ప్రమాణం చేయించారు తధానంతరం క్యాప్కో ఆర్గనైజేషన్ వారు ఇచ్చిన వినియోగదారుల సమాచారం మాసపత్రికను మరియు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వారు ముద్రించిన మేలుకొలుపు మాసపత్రికను వినియోగదారుల రక్షణ చట్టం 2019 పుస్తకాలను ఉపాధ్యాయుల ద్వారా ఆవిష్కరణ గావించడం జరిగినది వక్రీత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేయడం జరిగినది ఈ సందర్భంగా ఏఈ నాగరాజు ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్కెట్లో వినియోగదారులను కల్తీ మయమైన వస్తువులు నాసిరకం వస్తువులు కాలం చెల్లినావు వస్తువులను విక్రయించి వినియోగదారులను నష్టపరుస్తూ అనారోగ్యానికి గురి చేయుచున్నారని ప్రతి ఒక్కరూ బిల్లు అడిగి తీసుకోవడము వినియోగదారుని హక్కు అని బిల్లు తీసుకోవడం వలన నకిలీ వస్తువులు కల్తీ వస్తువులు కాలం చెల్లిన వస్తువులను కొనుగోలు చేయకుండా జాగృతి పడడం జరుగుతుంది బిల్లు తీసుకోవడం వలన వ్యాపారస్తుల ద్వారా ప్రభుత్వానికి సేల్ టాక్స్ ఇన్కమ్ టాక్స్ డబ్బులు వస్తాయి ఆ డబ్బులను ప్రజాసంక్షేమ పథకాల కొరకు ప్రభుత్వం వినియోగిస్తుంది మనం బిల్లు తీసుకోవడం వలన ప్రభుత్వానికి సహాయ పడటం జరుగుతుందని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంప్రసాద్ రంగారెడ్డి మురళీధర్ కుమార్ రఫీ రఘునాథ్ సుధాకర్ భాగ్యలక్ష్మి శాంతి మరియు బేతంచెర్ల మండలం వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షులుకురువ రవికుమార్ రాక్ స్టార్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా జననేత వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 21 నంద్యాల పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నివాసంలో మాజీ ముఖ్యమంత్రి జననేత వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఎమ్మెల్సీ ఇసాక్ బాషా అధ్యక్షతన మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, నంద్యాల మండల అధ్యక్షుడు శెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . వైయస్ జగన్మోహన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వైఎస్ఆర్సిపి నాయకులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు కోరారు. కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పరితపిస్తూ ప్రజల పక్షాన నిలిచిన జననేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ముందుకు వెళతామని వారి నాయకత్వం వర్ధిల్లాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ప్రజలకు అనేక వాగ్దానాల ఇచ్చి వాటిని అమలు చేయకుండా విస్మరించి ప్రజలను మోసం, దగా చేశారని విమర్శించారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను మాట తప్పక మడమ తిప్పక నెరవేర్చిన నాయకుడని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా తాను ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేనని చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం నాయకులు రోజుకో రంగులు మారుస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఇసుక విధానాన్ని అమలు పరచడంలో దారుణంగా వైఫల్యం చెందారని విమర్శించారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నా..ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం ప్రజలతో ఉంటామని పోరాటాలు చేస్తూ ప్రజలకు న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అడుగుజాడల్లో అంకితభావంతో నడుస్తామని తెలిపారు. రానున్న కాలంలో తిరిగి వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారం చేపట్టబోతుందని, జననేత జగన్ అన్నకు నీరాజనాలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల్లోకి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాబోతున్నారని జన సునామిని మరోసారి సృష్టించబోతున్నారని తెలిపారు. ఇకనైనా ప్రజలకు మోసపు వాగ్దానాలను చెప్పి అమలుకు నోచుకోని టిడిపి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అండగా ఉంటుందని, సువర్ణ రాజ్యం, జగనన్న రాజ్యం, రాజన్న రాజ్యం రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైసీపీ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి ,దేశం సుధాకర్ రెడ్డి ,రామలింగారెడ్డి, దాల్మిల్ అమీర్ , డా. శశికళ రెడ్డి, వైసీపీ కౌన్సిలర్ లు ఆరిఫ్ నాయక్, కలాం భాష, చంద్రశేఖర్ రెడ్డి, మేస చంద్రశేఖర్ , సాదిక్ భాష, బాసిద్ ,కోఆప్షన్ సభ్యులు సలాముల్ల, వార్డు వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ, కిరణ్, పార్థుడు ,సోమశేఖర్ రెడ్డి, రామచంద్రుడు, కాలువ నాగరాజు, ఎద్దు రవి, దేవ నగర్ బాషా, జాకీర్ హుస్సేన్, టీవీ రమణ, గన్ని కరీం,జలీల్, చింత శ్రీనివాసులు, సాయిరాం రెడ్డి,దండే సుధాకర్ ,కుమ్మరి రాముడు ,శంకర్ నాయక్ ,రామచంద్రుడు ఎస్సీ సెల్, కాసిం, కారు రవి, టైలర్ శివ ,ఎర్రన్న, చల్ల సత్యం, బషీర్, లాల్ బాషా, మరియు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**